# సాక్షి ఒడిశా

శనివారం । 17 । మే । 2025






శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,82,765

బంగారం : 10 గ్రాములు

వెండి : 24 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



**వీర జవాన్లకు నివాళి**

పర్లాకిమిడిలో వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీ చేశారు.

- IIలో▸



**పరిశుభ్రతతో డెంగీ నివారణ**

పరిశీలన పరిశుభ్రతతోనే డెంగీ నివారణ సాధ్యం. చైతన్య రథం కూడా ప్రారంభమైంది.

- IIలో▸

## న్యూస్‌రీల్

### ఆర్థిక సాయం అందజేత



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న యూనియన్ సభ్యులు

**రాయగడ:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాజీవ్‌లోచన్ పండ కుటుంబానికి రాయగడ ప్రెస్ యూనియన్ ఆర్థిక సాయం అందించింది. ప్రెస్ యూనియన్ అధ్యక్షుడు అమూల్య రత్న సాహు, కార్యదర్శి శివాజీదాస్, యూనియన్ ముఖ్య సలహాదారుడు సురేష్ దాస్‌లతో పాటు సభ్యులు శుక్రవారం అతని స్వగ్రామం ఖిలింగిలో కుటుంబ సభ్యులను కలిసి రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

### ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**రాయగడ:** జిల్లాలోని మునిగుడలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. సమితి కార్యాలయానికి అనుకొని ఉన్న సుమారు 20 దుకాణాలను అధికారులు తొలగించారు. మునిగుడ తహసీల్దార్ ఎం.అనురాధ ఆదేశానుసారం అదనపు తహసీల్దార్ సుభేందు సాహు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య ఈ తొలగింపు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. అయితే గత కొనేళ్లగా ఇక్కడ చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వ్యాపారులు తమకు వేరే ప్రాంతంలో స్థలం కేటాయించాలని కోరారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం దృష్టికి కూడా వీరు తీసుకెళ్లారు. అయితే సమితి కార్యాలయంతో పాటు సమీపంలోని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఎదురుగా ఉన్న ఈ దుకాణాలను తొలగించాలని ఇదివరకే వ్యాపారస్తులకు ముందస్తు నోటీసులు జారీ చేసినప్పటికీ, అందుకు స్పందించకపోవడంతో ఈ తొలగింపు కార్యక్రమం అనివార్యమైనట్లు అధికారులు పేర్కొన్నారు.

### నాటుసారా తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

**జయపురం:** నాటు సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు జయపురం అబ్కారిశాఖ అధికారి హిరన్ సుబ్రత్ శుక్రవారం తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం సమితి గొడొపాదర్ గ్రామానికి చెందిన భాస్కర హరిజన్, పాత్రోపుట్ వాసి ఘాశీ గొలారిలుగా గుర్తించామన్నారు. తెలిగుడ, పాత్రోపుట్ గ్రామాల్లో దాడులు నిర్వహించగా 21 లీటర్ల సారాతో ఇద్దరూ పట్టుబడినట్టు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

### మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టయిన నిందితుడు సునీల్ ఖొర

**జయపురం:** బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాష చంద్రరౌత్ శుక్రవారం వెల్లడించారు. అరెస్టు అయిన వ్యక్తి కొరాపుట్ నాయిక కాలనీ నివాసి సునీల్ ఖొరగా వెల్లడించారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించడంతో జైలుకు పంపినట్లు చెప్పారు. బాధితురాలైన బాలికను శిశు సురక్షా కమిటీ ముందు హాజరు పరుస్తామని చెప్పారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం జయపురం పట్టణం మైనర్ బాలిక గత ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు బయపడ్డారు. వారు అన్ని చోట్ల వెతికినా బాలిక జాడ తెలియక పోవటంతో లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లభించిన ఆధారాల మేరకు మైనర్ బాలికను కనుగొన్నారు. సునీల్ బాలికను అపహరించి అత్యాచారం జరిపినట్లు గుర్తించారు.

# ప్రేమ మైకంలో.. పెంపుడు తల్లి హత్య

- పర్లాకిమిడి తెలుగు సొండి వీధిలో ఘటన
- ఇద్దరు నిందితుల అరెస్టు, కోర్టుకు తరలింపు



పర్లాకిమిడి ఆదర్శ పోలీసు స్టేషన్‌లో విలేకరులతో ఎస్పీ జ్యోతీంద్ర నాథ్ పండా, ఎస్‌డీపీఓ మాధవానంద నాయక్, ఐఐసీ ప్రశాంత భూపతి

**పర్లాకిమిడి:** ప్రేమ మైకంలో ఓ యువతి తన పెంపుడు తల్లిని హతమార్చింది. ఈ మర్డర్ మిస్టరీని పోలీసు అధికారులు ఛేదించారు. ఎస్పీ జ్యోతీంద్ర పండా ఆదర్శ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

స్థానిక తెలుగు సొండి వీధిలో రాజ్యలక్ష్మీ కోరో (54) గత నెల 26న అనుమానాస్పదంగా చనిపోయింది. మృతురాలి పెంపుడు కూతురు పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తన ప్రియుడు, స్నేహితుని సహాయంతో మృతదేహాన్ని తరలించింది. ఈ విషయం భువనేశ్వర్‌లో ఉన్న మృతురాలి సోదరుడు ప్రసాద్ మిశ్రాకు ఫోన్ చేసి తెలియజేశారు. ఈ లోగా పెంపుడు కూతురు, అతని ప్రియుడు కలిసి పోలీసు కేసు కాకుండా చూసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో భువనేశ్వర్‌కు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కూతురు కొద్ది నెలలుగా గణేష్ రథ్ (21) అనే వ్యక్తితో ప్రేమలో ఉంది. దీన్ని గమనించిన తల్లి ఆమెను మందలించింది. దీంతో ఆమె అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడితో పాటు స్నేహితుడు దినేష్ సాహు అలియాస్ అమన్ సాయంతో తల్లిని చంపడానికి పథకం పన్నారు. పథకం ప్రకారం ఏప్రిల్ 26న ఆమె నిద్రిస్తున్న సమయంలో దిండు సహాయంతో ఇద్దరు స్నేహితులు చంపి, నగదు, బంగారం దొంగిలించి పారిపోయారు. సోదరి చనిపోయాక ఆమె పెంపుడు కూతురిలో మార్పులు గమనించిన ప్రసాద్ మిశ్రా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారు నిందితురాలిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. దీంతో హత్య జరిగినట్లు నిర్ధారించారు. నిందితులందరినీ గుర్తించి వారిని అరెస్టు చేసి విచారించగా రాజలక్ష్మీ కోరోకు మత్తు మందు ఇచ్చి ఎలా చంపారో వారే పోలీసులకు వివరించారు. మృతురాలి ఇంటి నుంచి 7 తులాల బంగారం వస్తువులు, రూ.60 వేలు నగదు చోరీ కాగా 2.6 గ్రాముల బంగారం, మూడు మొబైళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ జ్యోతీంద్రనాథ్ పండా విలేకరుల సమావేశంలో తెలియజేశారు. నిందితులు ఇద్దరు గణేష్ రోథ్, దినేష్ సాహులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.



స్వాధీనం చేసుకున్న దొంగిలించిన బంగారం వస్తువులు

## అకాల వర్షాలకు 'రాష్ట్ర నిర్దిష్ట విపత్తు' గుర్తింపు

- 10 శాతం ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు కేటాయింపు



**భువనేశ్వర్:** ఏటా ప్రకృతి విపత్తులతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటుంది. ప్రధానంగా రైతుల వెతలు వర్ణనాతీతం. ఈ విపత్కర వాతావరణ పరిస్థితి ప్రభావాన్ని విపత్తుగా గుర్తించి విపత్తు స్పందన సహాయం ప్రకటించాలని బాధిత వర్గం దీర్ఘ కాలంగా అభ్యర్థిస్తోంది. వీరి అభ్యర్థనకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఇది రైతులకు కొంత మేరకు ఊరట కలిగించింది. తరచుగా విస్తృతమైన పంట నష్టాన్ని కలిగించే అకాల వర్షాన్ని రాష్ట్ర నిర్దిష్ట విపత్తుగా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆమోదించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం అకాల వర్షాల కారణంగా పంటలకు జరిగిన నష్టానికి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్ డీఆర్‌ఎఫ్) నుంచి సహాయం పొందగలుగుతారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ వార్షిక కేటాయింపులో గరిష్టంగా 10 శాతం వరకు నిధుల్ని అకాల వర్షాల నష్ట పరిహారంగా చెల్లించేందుకు అనుమతించడం విశేషం.

గత ఏడాది డిసెంబర్ నెలలో అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో 22 వేల 791 హెక్టార్ల విస్తీర్ణపు పొలాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. ఈ విపత్తుకు 6 లక్షల 66 వేలకు పైగా రైతులు ప్రభావితం అయ్యారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం దీన్ని తాత్కాలికంగా ప్రత్యేక రాష్ట్ర విపత్తుగా ప్రకటించి పీడిత వర్గానికి ఊరట కలిగించింది. ఈ నేపథ్యంలో రైతులకు సాగు పెట్టుబడి సబ్సిడీ రూపంలో రూ. 291 కోట్ల సహాయం అందజేసి ఆదుకుంది. ముఖ్యమంత్రి తాజా నిర్ణయంతో అకాల వర్షాలను శాశ్వతంగా రాష్ట్ర విపత్తుగా ప్రకటించారు. దీని కోసం రైతులకు ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి సహాయం అందుతుందని అభయం ఇచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది విపత్తులను రాష్ట్ర నిర్దిష్ట విపత్తులుగా గుర్తించింది. వాటిలో పిడుగుపాటు, వడగాడ్పులు, సుడి గాలులు, భారీ వర్షం, పడవ ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాము కాట్లు చోటు చేసుకున్నాయి. అకాల వర్షాన్ని ఈ జాబితాలో చేర్చడంతో రాష్ట్ర నిర్దిష్ట విపత్తుల సంఖ్య 9కి పెరిగింది. రాష్ట్రాన్ని ప్రభావితం చేసే తుఫానులు, కరువులు, భూకంపాలు, వరదలు వంటి ప్రముఖ జాతీయ విపత్తులు కేంద్ర ఆమోదం పొందిన విపత్తుల జాబితాలో కొనసాగుతున్నాయి. ఆ ప్రకారం విపత్కర పరిస్థితుల్లో ప్రభావిత వర్గాలకు సముచిత సహాయ సహకారాలు అందుతున్నాయి.

## • ఆహా.. ఏం హాయి



వేసవి తాపంతో జనజీవనం అల్లాడిపోతోంది. మూగజీవాలు కూడా ఎండకు తాళలేకపోతున్నాయి. హిరాకుడ్ వన్య ప్రాణుల మండలం సంబల్‌పూర్ జంతు ప్రదర్శన శాలలో ఈ దృశ్యం తారసపడింది. చల్లని ఐసు దిమ్మను అక్కున చేర్చుకుని ఈ భల్లూకం వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతోంది. చూపరులను ఈ దృశ్యం ఆకట్టుకుంది.

– భువనేశ్వర్

## కొరాపుట్‌లో 'ఎయిమ్స్' ఏర్పాటు చేయాలి



ఎయిమ్స్ అధికారులతో మాట్లాడుతున్న పార్లమెంటు సభ్యులు

- ఎంపీ సప్తగిరి శంకర ఉల్క విజ్ఞప్తి



సమావేశంలో ఎంపీలు సప్తగిరి ఉల్క, అపరాజిత షాడంగిలు

**జయపురం:** కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) శాటిలైట్ కేంద్రం ఏర్పాటు చేయాలని పార్లమెంటు సభ్యుడు సప్తగిరి శంకర ఉల్క కోరారు. గురువారం భువనేశ్వర్‌లో ఎయిమ్స్ పదవ ప్రతిష్టా సమావేశంలో ఎయిమ్స్ సభ్యులైన భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షాడంగి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కలు పాల్గొన్నారు. ఎయిమ్స్ భువనేశ్వర్ సమగ్ర వికాసం, ఉత్తమపాలన, ఉత్తమ వైద్య సేవలు అందిస్తోందని ప్రశంసించారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గ పరిధిలో ఎయిమ్స్ శాటిలైట్ కేంద్రం ఏర్పాటు చేయాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క ప్రతిపాదించారు. తన ప్రతిపాదనను సమావేశం ఆమోదించిందని ఉల్క తన సొంత సోషల్ మీడియాలో సూచన ప్రాయంగా వెల్లడించారు. అతిత్వరలోనే కొరాపుట్ లోక్‌సభ పరిధిలో ఒక ఎయిమ్స్ శాటిలైట్ కేంద్రం ఏర్పాటు జరుగుతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో బాలేశ్వర్‌లో ఇటువంటి సెటలైట్ కేంద్ర ఏర్పాటు జరిగిందని వెల్లడించారు.

## పిడుగు పడి ముగ్గురు దుర్మరణం



పారిడిగుడ గ్రామంలో పిడుగు పడి మరణించిన వారు

**జయపురం:** కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి ఒడియపెంట పంచాయతీ పారిడిగుడ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగు పడి ముగ్గురు మృతి చెందగా.. ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వర్షం పడుతున్న సమయంలో వారు ఓ గుడిసెలో తల దాచుకున్నారు. ఆ సమయంలో పిడుగు పడడంతో అందులో ఉన్న ముగ్గురూ మృతి చెందారు. మరణించిన వారు ఒకే కుటుంబానికి చెందిన వారని సమాచారం. చనిపోయిన వారిలో బుద్దా మండంగి(60) ఆమె మనుమరాలు కొశా మండంగి(18)తో పాటు కుంబారిగుడ గ్రామానికి చెందిన అంబిక (35) ఉన్నారు. హింగు మండంగి అనే మరో మహిళ గాయపడ్డారు. ఆమెను లక్ష్మీపూర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. రెండు రోజుల కిందట కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి అంపావల్లి పంచాయితీ ప్రాంతంలో పిడుగు పడి ముగ్గురు మరణించిన విషయం విదితమే. ఆ సంఘటన మరుకవ ముందే లక్ష్మీపూర్ సమితిలో ఈ సంఘటన జరిగింది.

## అగ్ని గంగమ్మ పండగ ప్రారంభం



పూజలందుకుంటున్న అగ్ని గంగమ్మ అమ్మవారు



ముస్తాబవుతున్న మందిరం

**రాయగడ:** స్థానిక పిట్టలవీధిలోని అగ్ని గంగమ్మ అమ్మవారి వార్షిక పండగ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యింది. సాయంత్రం అమ్మవారి పాదా లు తీసుకువచ్చే కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక కేఎస్‌కే సమీపంలోని అమ్మవారి పాదాల గుడి నుంచి సాంప్రదాయ పూజ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం మందిరంలో పాదాలను ఉంచడంతో పండగకు శ్రీకారం చుట్టారు. ఐదు రోజుల పాటుగా జరగనున్న ఈ పండగలో భాగంగా ఆఖరి రోజున మల్లెలు (అగ్గిపై నడవడం) తొక్కే కార్యక్రమం ప్రధాన ఘట్టం. దీనిని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు హాజరవుతారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. పండగలో అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. హిందూ, ముస్లింలు కలసి ఈ పండగను ప్రతీ ఏడాది జరుపుతుండడం విశేషం.

# యువతి దారుణ హత్య



రంజిత మృతదేహాన్ని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు



రంజిత కొండగిరి (ఫైల్)

**రాయగడ:** ఒక యువతిపై కర్రలతో దాడిచేసి అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన జిల్లాలోని రామనగుడ పోలీసుస్టేషన్ పరిధి కొరడ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మృతురాలు రంజిత కొండగిరి (25)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి క్లూస్ టీమ్‌తో చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొరడ గ్రామంలో నివసిస్తున్న రంజిత రామనగుడ పంచాయతీలోని బంగి కూడలిలో నివసిస్తున్న అక్షయ పతిక అనే యువకుడితో గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉంది. అయితే ఇదివరకే అక్షయ పతికకు రాజవిక్రమపూర్ గ్రామానికి చెందిన మరో యువతితో వివాహం అయ్యింది. అయినప్పటికీ రంజితతో ప్రేమ వ్యవహారాన్ని అక్షయ కొనసాగిస్తుండేవాడు. ఈ విషయం అక్షయ పెద్ద అన్నయ్య మాధవ పతిక దృష్టికి వచ్చింది. దీంతో విషయాన్ని తన అమ్మ దుఖి పతికకు తెలియజేశాడు. దీంతో శుక్రవారం మాధవ, అతని తల్లి దుఖి, రాజవిక్రమపూర్‌లో నివసిస్తున్న అక్షయ పతిక బావమరిది డొంబురు కద్రకలు ఒక బైకుపై కొరడ గ్రామానికి వెళ్లి ఇంట్లో ఉన్న రంజితపై కర్రలతో మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో తీవ్రగాయాలకు గురైన రంజిత అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. గాయాలతో ఉన్న రంజితను కుటుంబీకులు గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం పర్లాకిమిడి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన మాధవ పతిక, దుఖి పతిక, డొంబురు కద్రకలను అదుపులోకి తీసుకున్నారు.

## యువకుడి దారుణ హత్య



హత్యాకాండ ప్రాంతంలో పోలీసుల దర్యాప్తు

**భువనేశ్వర్:** కొబ్బరి బొండాల వివాదం పూరీ ప్రాంతంలో ఒక వ్యక్తి ప్రాణాల్ని బలిగొంది. ఈ వివాదంతో మొషాణీ చండీ గుడి దగ్గర బీభత్సమైన హత్యాకాండ చోటు చేసుకుంది. గురువారం అర్ధరాత్రి కున్నా బెహరా అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కక్షదారులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో యువకుడు చనిపోయాడు. ఈ సంఘటనపై లిపున్ భోయ్, కొంత మంది సహచరులపై ఫిర్యాదు నమోదైంది. కొబ్బరి బొండాల కోత కారణంగా హత్య జరిగిందనే ఆరోపణ బలంగా వ్యాపించింది. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. స్థానిక బసేలి సాహి థాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదం: నలుగురు మృతి



ప్రమాద స్థలంలో కారు



అంబిక బానా దాస్ మృతదేహం



డ్రైవార్ విభూతి భూషన్ మృతదేహం



శశి బెహర మృతదేహం

**మల్కన్‌గిరి:** మల్కన్‌గిరి జిల్లా సరిహద్దున ఉన్న బైపారగూఢ పంచాయతీ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో నయాగడ నుంచి మల్కన్‌గిరి వస్తున్న ఓ వాహనం చెట్టును ఢీకొట్టి నలుగురు మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. వేసవి సెలవులు కావడంతో నయాగడ నుంచి బంధువుల ఇంటికి సుజిత్ కుమార్ సింగ్ సామంత్ (45), పద్మినీ సింగ్ సామంత్ (42), ప్రియాంశు (10), అంబికాబానా దాస్(65), శశి బెహర (65) గురువారం బయల్దేరారు. వీరు మల్కన్‌గిరిలో ఉంటున్న ప్రదీప్ కుమార్ సింగ్ సామంత్ ఇంటికి వస్తున్నారు. మరో గంటలో ఇంటికి చేరుకుంటామనగా కారు చెట్టును ఢీకొట్టింది. ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. డ్రైవర్ విభూతి భూషన్ బెహర నిద్రమత్తులో చెట్టును ఢీకొన్నట్టు గుర్తించారు. మృతులు విభూతి భూషన్ బెహర (44), అంబికా బానా దాస్, శశి బెహర మృతదేహాలను బపారగూఢ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రులను కొరాపూట్ లక్ష్మణ్ నాయిక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పద్మినీ ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మల్కన్‌గిరి నుంచి ప్రదీప్ కుమార్ సింగ్ సామంత్, బావమరిది రాజేంద్ర జెన సామంత్ ఇద్దరు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బైపారగూఢ పోలీసులు సంఘటనపై కేసులు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

# ఒడిశాను మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తాం



ఉత్తమ పనితీరు అవార్డు ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి



వ్యవస్థాపక దినోత్సవానికి హాజరైన సిబ్బంది, అధికార వర్గం

- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి
- ఓఎంసీ 70వ వ్యవస్థాపక దినోత్సవం
- బొడొబిలొ 'డుబునా' ఇనుప ఖనిజ గని పునఃప్రారంభం

భువనేశ్వర్:

ఒడిశా వ్యవసాయ ప్రాధాన్య రాష్ట్రమని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడితే ఎదుగదల అసాధ్యమని, అందుకే రాష్ట్రాన్ని మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు. తయారీకి అవసరమైన ముడి పదార్థాలు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని, రాష్ట్ర పారిశ్రామికీకరణ సామర్థ్యాన్ని సఫలీకృతం చేసుకుని ఒడిశాను మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా మలచడం సులభతరమేనని ముఖ్యమంత్రి ప్రోత్సహించారు. రాష్ట్రం ఖనిజ ఉత్పత్తులను వ్యాట్ విధానాన్ని అవలంబించింది. వ్యవస్థాపకత ద్వారా వేగవంతమైన పారిశ్రామికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఖనిజ వనరులతో తులతూగే రాష్ట్రంగా జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించి జాతీయ ఖనిజ వనరులలో రాష్ట్ర వాటా 41.9 శాతంతో అగ్రగామిగా కొనసాగుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. స్థానిక ఓయూఏటీ కృషి శిక్షా సదన్‌లో శుక్రవారం నిర్వహించిన ఓఎంసీ 70వ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక శ్రేయస్సుకు ఓఎంసీ బలమైన పునాదిగా నిలిచింది. ప్రకృతిపరమైన ఖనిజ వనరులను బాధ్యతాయుతంగా అన్వేషిస్తూ క్రమబద్ధీకరణతో తవ్వకాలు చేపట్టి ఈ సాఫల్యత సాధించిందని అభినందించారు. ఓఎంసీ 60 దశకంలో కేవలం రూ. 1 కోటి ఆర్థిక లావాదేవీలతో తన ప్రయాణాన్ని ప్రారంభించి 2024–25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 23,600 కోట్ల ఆర్థిక లావాదేవీల స్థాయికి చేరిందని అన్నారు. ఈ లావాదేవీ పూర్తిగా ఖనిజాల ఉత్పత్తి, అమ్మకం ద్వారా సాధ్యం చేసుకుందన్నారు. నేడు జాతీయ స్థాయిలో ఖనిజ ఉత్పత్తి కంపెనీలలో ఓఎంసీ 5వ అగ్ర స్థానంలో ఉందని, దేశ వ్యాప్తంగా లాభాలను ఆర్జించే ఆదర్శ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా స్థిరపడిందని, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో మార్గదర్శిగా నిలిచి దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బొడొబిలొ డుబుణ ఇనుప ఖనిజ గనులు, తిరింగి కొండ ప్రాంతంలో గనులు తవ్వకం పునఃప్రారంభించారు. ఈ ప్రాంతంలోని రెంగాలిబెడా ఆర్ఆర్ కాలనీకి విద్యుత్ సరఫరా, కొయిడా మైనింగ్ ప్రాంతంలో ఉన్న ఓఎంసీ గనులలో 900 కిలో వాట్ పీక్ సోలార్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కంపెనీ పనితీరును మరింత మెరుగుపరచడానికి నాలుగు ఐటీ విభాగాలు స్థాపించినట్లు ప్రకటించారు. వాటిలో లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్ఎంఎస్), ఓఎంసీ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓఎఫ్ఎంఎస్), ఓఎంసీ ప్లాట్ ల్యాండ్ యుటిలైజేషన్ సిస్టమ్ (ఓప్లస్) మరియు ఓఎంసీ రిక్రూట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓఆర్ఎంఎస్) వంటి మాడ్యులర్ సిస్టమ్‌లు ఉన్నాయి. 2023–24, 2024 –25 సంవత్సరాలకు ఉత్తమ మైనింగ్ రంగం, ఉత్తమ గని, సురక్షితమైన గని అనే మూడు విభాగాలలో ముఖ్యమంత్రి అవార్డులను అందజేశారు. 3 విభాగాలలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ముఖ్యమంత్రి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ సీఎస్ఆర్ ఆధారిత కార్యక్రమాల ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు.



ముఖ్యమంత్రి ప్రసంగం

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గనులు, ఉక్కు శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా పాల్గొని రాష్ట్ర పారిశ్రామిక రంగం ముఖచిత్రం ఆవిష్కరణతో ఓఎంసీ పాత్రను ప్రసంశించారు. నేటి నుంచి ఓఎంసీ ఆధీనంలో 18 గనులు పనిచేయడం ప్రారంభించాయని అన్నారు. ఈ చర్య ఖనిజాలను ఉత్పత్తి చేయడంతో బలమైన స్వావలంబన కలిగిన రాష్ట్ర ఆవిష్కరణకు పునాది వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఓఎంసీ అధునాతన తయారీ, అత్యాధునిక సాంకేతికత ద్వారా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని బలోపేతం చేస్తుందన్నారు. సహజ వనరులను సద్వినియోగపరచుకుని బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థకు ఎదిగామని రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ అన్నారు. ఓఎంసీ నిరంతర అభివృద్ధి ప్రక్రియలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో నిమగ్నం కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గనులు, ఉక్కు శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి, ఓఎంసీ చైర్మన్ సురేంద్రకుమార్, ఓఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ సుధాంశు మోహన్ సమల్, కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## కుప్పకూలిన ఉపాధి వేతనదారుడు

టెక్కలి: సీతాపురం పంచాయతీ వలియాసాగరం గ్రామంలో శుక్రవారం ఉపాధి పని చేస్తున్న పైల ధనుంజయరావు ఒక్కసారిగా కుప్పకూలి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తోటి వేతనదారులు ధనుంజయరావును టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఏపీఓ ప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని వేతనదారుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఇదే పంచాయతీలో ఇటీవల క్షేత్ర సహాయకుడి తొలగింపు విషయంలో రాజకీయం ప్రమేయం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఇన్‌చార్జి క్షేత్ర సహాయకుడు నియామకం విషయంలో మండల స్థాయి అధికారులు జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేశారంటూ పలువురు వేతనదారులు చెబుతున్నారు. ఇప్పుడు జరిగిన సంఘటనతో సీతాపురం పంచాయతీ ఉపాధి హామీ పనుల్లో మరోసారి రచ్చ చోటుచేసుకుంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలం వద్ద క్షతగాత్రులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. నరసన్నపేట నుంచి కోటబొమ్మాళి వైపు వెళ్తున్న లాగేజ్ వ్యాన్ హరిశ్చంద్రాపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ఎన్.ఉమా, పి.లోకేష్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### రైలు ఢీకొని యువతి మృతి



సబియా మృతదేహం

రాయగడ: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువతి మృతి చెందింది. మృతురాలు సదరు సమితి పరిధిలోని కొత్తపేటకు చెందిన సబియా మాఝి (18)గా గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సబియ కొత్తపేటకు సమీపంలోని వీరనారాయణపూర్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో మధ్యలో ఉన్న ట్రాక్‌ను దాటుతుంది. అదే సమయంలో రైలు రావడాన్ని చూసి పట్టాలు దాటేందుకు పరుగెత్తగా కాలి చెప్పు ఒకటి ఉండిపోయింది. దానిని తీసుకెళ్లేందుకు వెళ్లగా అదే సమయంలో రైలు ఆమెను ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

### రబీ ధాన్యం కొనుగోలు చేయలేదని రైతుల ఆందోళన



పొలంలో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో ఈ ఏడాది రబీ పంటల సాగుకు కాలువల ద్వారా నీరు విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రెండో పంట కలిసి వస్తోంది ఆశపడ్డారు. ధాన్యం పంట బాగా కలిసి వచ్చింది. అయితే నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో మార్కెట్లో ధర పలకడం లేదని కోరుకొండ సమితి రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కన్‌గిరి జిల్లాతో పాటు రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ధాన్యం ధర క్వింటా రూ. 3,100 ఉన్నప్పటికీ వీటిని కొనుగోలు చేయడం లేదు. ప్రధానం మల్కన్‌గిరి జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో పొలాల్లోనే ధాన్యం మూలుగుతున్నాయి. వీటికి రైతు కుటుంబసభ్యులంతా పొలాల్లోనే కాపలాగా ఉంటున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.

### పాత నేరస్థులపై నిఘా



టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టెక్కలి: టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా వేయాలని, రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు.

### కానిస్టేబుల్‌కు వడదెబ్బ



కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యుగంధర్ శుక్రవారం బందోబస్తు విధుల్లో ఉండగా ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురయ్యారు. వెంటనే తోటి సిబ్బంది స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

### బాణసంచా దుకాణంలో చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఇబ్రహింబాద్ పంచాయతీ పరిధిలో కింతలి రోడ్డులో ఉన్న ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఓ వ్యక్తి క్యాష్ కౌంటర్‌లో ప్రవేశించి తాళాలు పగల కొట్టి లాకర్‌లోని నగదు చోరీ చేశాడు. రూ.10 వేలు వరకు నగదు ఉంటుందని యజమానులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం షాపు వద్దకు వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించడంతో యజమాని వావిలపల్లి శ్యామలరావు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# పరిశీలన, పరిశుభ్రతతో డెంగీ నివారణ

భువనేశ్వర్: ప్రాణాంతక డెంగీ మహమ్మారిని సులభ రీతిలో నివారించడం సాధ్యమేనని ప్రముఖులు ప్రబోధించారు. రాష్ట్ర స్థాయి జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని ఆరోగ్య శాఖ ప్రముఖులు ఈ విషయాన్ని వివరించారు. పరిశీలన, పరిశుభ్రతతో డెంగీ నివారణ ఈ ఏడాది నినాదంగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలలో అవగాహన పెంపొందించి ప్రభావవంతమైన డెంగీ నివారణ వ్యూహాలను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రూపొందించిందని తెలిపారు. స్థానిక కంబైండ్ హెల్త్ డైరెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి అనుబంధ వర్గాలు వర్చువల్ మాధ్యమంలో పాలుపంచుకున్నారు. వెక్టర్ బోర్న్ డిసీజెస్ అదనపు డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ సాహు, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా, అదనపు డైరెక్టర్ డాక్టర్ ప్రమీల బొరాల్, వైద్య విద్య శిక్షణ సంస్థ అదనపు డైరెక్టరు డాక్టర్ బ్రజకిషోర్ దాస్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డెంగీ నివారణలో సమాజ భాగస్వామ్యం యొక్క అవసరాన్ని ప్రజారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ జితేంద్ర మోహన్ బబర్త తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డెంగీ నివారణ నినాదం, చైతన్య సందేశంతో చైతన్య రథం సేవల్ని ప్రముఖులు ప్రారంభించారు.



రాష్ట్ర స్థాయి జాతీయ డెంగీ దినోత్సవ సదస్సు

## చోరీ సొత్తు స్వాధీనం

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దకొత్తకోట ఎస్సీ కాలనీలో ఓ ఇంట్లో ఈ నెల 3న చోరీకి గురైన 2 తులాల 3 గ్రాముల బంగారం వస్తువులు, ఇత్తడి వస్తువులను రికవరీ చేసినట్లు జీఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అదపాక గ్రామానికి చెందిన ముద్దాయి పిన్నింటి చంద్రరావు (పోలారావు) పాత కుంకాం గ్రామంలో మామిడితోటలో కాపలాగా ఉండేవాడు. తోడల్లుడు, మరో వ్యక్తితో కలిసి ఈ నెల 3న పెద్దకొత్తకోట గ్రామానికి వెళ్లి దొంగతనం చేశారు. డీఎస్పీ వివేకానంద ఆదేశాల మేరకు సీఐ అవతారం, లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు, సిబ్బంది రంగంలోకి దిగి క్లూస్‌టీం ఇచ్చిన సమాచారంతో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చంద్రరావు వద్ద ఇత్తడి సామాన్లు, అతని భార్య, మరదలు వద్ద బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చంద్రరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పురం సీఐ అవతారం

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అదపాకలో పాత నేరస్తులు చాలా మంది నేరాలు చేయడం మానేసి కూలీ పనులు చేస్తూ బతుకుతున్నారని, కానీ కొందరు తిరిగి నేరాలు చేయడం ప్రారంభించారని చెప్పారు. దీనివల్ల గ్రామానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఇలాంటి వ్యవహారాలు మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# వీర జవాన్లకు ఘన నివాళి



కొవ్వొత్తులతో కాంగ్రెస్ శ్రేణుల నివాళులు

పర్లాకిమిడి: ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీర సైనికుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ పర్లాకిమిడి కాంగ్రెస్ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులు వెలిగించి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. యుద్ధంలో పాకిస్తాన్ సైనికులను మట్టికరిపించిన అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈశ్వర్ చంద్ర మఝి, సంజయ్ అధికారి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జాస్మిన్ షేక్ సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సూర్యనారాయణ పాత్రో, అశోక్ అధికారి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ నాయకురాలు జాస్మిన్ షేక్

## దివ్యాంగులకు ఉపాధి కల్పనపై దృష్టి

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి 12 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధా, బీసీ కార్పొరేషన్ అధికారి గడ్డెమ్మ, విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడీ కె.కవిత పాల్గొన్నారు.

## 100 లీటర్ల నాటుసారా స్వాధీనం

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 100 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ జీవీ రమణ తెలిపారు. మండలంలోని బకుడ గ్రామంలో సవర లక్ష్మి వద్ద 70 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రాగుపురం గ్రామంలో 30 లీటర్ల నాటు సారాతో నర్తు హేమరాజును అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

# మురపాకలో నాలుగు పూరిళ్లు దగ్ధం

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గార రాములమ్మ, లావేటి లక్ష్మీ, మామిడి ఈశ్వరరావు, లావేటి రాములమ్మలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామాన్లు, రూ.70 వేలు నగదు, బంగారం కాలిపోయాయి. అందరూ ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. ముందుగా లావేటి రాములమ్మ ఇంటివద్ద మంటలు చెలరేగి వరుసగా ఉన్న ఇల్లు కాలిపోయాయి. స్థానిక యువత స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపుచేశారు. లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు నాలుగు ప్యాకెట్లు బియ్యం, రూ.2 వేలు తక్షణ సహాయం అందించారు. ఎంపీటీసీ ప్రతినిధి తేనెల సురేష్, స్థానిక నాయకులు మడ్డి కనకయ్య, జల్లేపల్లి శారద తదితరులు సహాయక చర్యలు చేపట్టారు.



మంటలను అదుపుచేస్తున్న యువకులు

# తనయుడికి తలకొరివి పెట్టిన తల్లి

సంతబొమ్మాళి: కన్న కొడుక్కి తల్లి తలకొరివి పెట్టిన ఘటన సంతబొమ్మాళి మండలం సుగ్గువానిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆకాశలక్కవరం పంచాయతీ సుగ్గువానిపేట గ్రామానికి చెందిన పైల శాంతారావు (22) అనే యువకుడు 15 రోజుల క్రితం వరికోత మిషన్‌తో కలిసి లారీలో వలస కూలీగా రాజమండ్రి వెళ్లారు. వరి కోతలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద డ్రైవర్ నిద్ర వస్తుందని వాహనం ఆపి నిద్రపోయారు. శాంతారావు డ్రైవర్‌కు చెప్పకుండానే లారీ కింద నిద్రపోయాడు. ఇతనిని గమనించని డ్రైవర్ గురువారం వేకుజామున లారీ తీయడంతో శాంతారావు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చారు. తండ్రి లేకపోవడంతో తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తలకొరివి పెట్టారు. రోడ్డు ప్రమాదంపై నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.



తలకొరివి పెడుతున్న తల్లి లక్ష్మి

# పనులు పూర్తయ్యేనా?



ఆఫ్‌షోర్ రిజార్వాయర్ వద్ద జరుగుతున్న ఎర్తబండ్ పనులు

- ఎట్టకేలకు ఆఫ్‌షోర్ పనులు పునఃప్రారంభం
- అంచనాలు పెరగడమే తప్ప పూర్తికాని వైనం
- ఎక్కడికక్కడే నిర్వాసితుల సమస్యలు

పలాస: మండలంలోని రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ఎట్టకేలకు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎప్పటికప్పుడు పనులు ప్రారంభించడం .. కొన్నాళ్లు కొనసాగడం.. తర్వాత నిలిచిపోవడంతో పరిపాటిగా మారింది. అరకొర నిధులు నేపథ్యంలో ఈసారి కూడా పనులు పూర్యయ్యేది అనుమానమేనన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌వద్ద ఎర్త్ బండ్ పనులు జరుగుతున్నాయి.

**17 ఏళ్లుగా కొనసాగుతూ..**

రేగులపాడు నుంచి నందిగాం, మెళియాపుట్టి మండలాలకు ఆర్.ఎం.సి, పలాస మండలానికి ఎల్.ఎం.సి కాలువల ద్వారా మొత్తం 24,500 ఎకరాలకు సాగునీరు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీరు అందించేందుకు 2008లో రూ.128 కోట్ల అంచనా వ్యయంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులకు రూ.456 కోట్లు అంచనా వేశారు. అయినా పనులు మాత్రం జరగలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 2021లో ఈ పనులకు రూ.850 కోట్లు అంచనా వేసి పనులు ప్రారంభించారు. ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పునరావాసాలు కల్పించారు. రిజర్వాయర్ సంబంధించిన పనులు కూడా కొంతమేర జరిగాయి. తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓటాన్ అకౌంట్ బడ్జెటులో రూ.30 కోట్లు కేటాయించారు. తాజాగా ఇప్పుడు మరో రూ.90 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఎర్త్ బండ్ పనులు ప్రారంభమయ్యాయి. మెళియాపుట్టి మండలం చాపర వద్ద మహేంద్రతనయ నది నుంచి వరద కాలువను 13.6 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ఇందులో 7 కిలోమీటర్ల పని పూర్తి చేశారు. మిగిలినది అసంపూర్తిగా ఉంది. ప్రస్తుతం ఎర్త్ బండ్ పనులతో పాటు కుడికాలువ మెయిన్ కెనాల్ పనులతో పాటు వరదకాలువలో డీవాటరింగ్ పనులు చేపడుతున్నారు. మరోవైపు, సుమారు 17 ఏళ్లు పూర్తవుతున్నా నిర్వాసితుల సమస్యలు ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టుతో పాటు నిర్వాసితుల సమస్యలు ఎప్పటికి పూర్తవుతాయో వేచి చూడాల్సిందే.

### సగం భూమి పోయింది..



తాతలతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి 3 ఎకరాలు. ఇందులో ఎకరాన్నర భూమి రిజర్వాయర్‌లో కలిసిపోయింది. ఇల్లు పోయింది. 2008లో ఎకరాకు రూ.2.30 లక్షలు ఇచ్చారు. అవి అప్పుడే ఖర్చయిపోయాయి. ఉన్న భూమి వదల్లేను. ఇక్కడ ఉండటానికి ఇల్లు లేదు.

– దాసరి తాతారావు, రైతు, రేగులపాడు, పలాస మండలం

### వచ్చే ఏడాదికి నీరు నిల్వ



వచ్చే ఏడాది జూన్‌కల్లా ఆఫ్‌షోర్‌లో 0.521 టి.ఎం.సిలు నీటిని నిల్వ చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ఆ దిశగా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఆఫ్‌షోర్ సామర్థ్యం 1.864 టి.ఎం.సిలు. అందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. రోజుకు 8000 క్యూబిక్ మీటర్ల మట్టిపనిని చేస్తున్నాం. ఇప్పటి వరకు 45 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

– బి.శేఖరబాబు, ఈఈ, వంశధార ప్రాజెక్టు

## క్లుప్తంగా

### డెంగీ నిర్మూలన సామాజిక బాధ్యత

● డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి

**విజయనగరం ఫోర్ట్/విజయనగరం:** డెంగీ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యతగా గుర్తించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గంటస్తంభం వరకు శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్బోవైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల డెంగీ వైరస్‌ల వల్ల ఈవ్యాధి వస్తుందన్నారు. ఇది మనిషి నుంచి మనిషికి ఏడిస్ ఈజిప్ట్ దోమలు కుట్టడం వల్ల సంక్రమిస్తుందని తెలిపారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటాయని చెప్పారు. పగటి పూట కుడతాయని, ఎక్కువ దూరం 400 మీటర్లు ఎగరలేవన్నారు. ఈవైరస్ వల్ల ఒకటి కంటే ఎక్కువ సార్లు కూడా డెంగీ రావచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాణి, డీఎంఓ మణి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక రేపు

**విజయనగరం:** రాష్ట్రస్థాయిలో జరగనున్న చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈ నెల 18 నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం 9 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రింగ్ రోడ్డు ఫైర్ చెస్ స్కూల్లో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అండర్ 7, 9,11,13 వయస్సుల విభాగాల్లో బాల బాలికలతో పాటు, ఓపెన్ విభాగంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి రాజాంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ శిక్షణ క్యాంప్ ప్రారంభం



ఎన్‌సీసీ క్యాడెట్లతో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర

**విజయనగరం అర్బన్:** గాజులరేగలోని సీతం కాలేజీలో ఎన్‌సీసీ 2(ఏ) వార్షిక శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. శిబిరాన్ని ప్రారంభించిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర మాట్లాడుతూ పదిరోజులు నిర్వహిస్తున్న ఈ శిబిరంలో వసతి సౌకర్యాలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. పరిశుభ్రతను కొనసాగించాలని భవిష్యత్తులో యువత ఉన్నత స్థాయికి చేరుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేణి, సుబేదార్ మేజర్ బోర్డే, పరమేశ్వర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ లెఫ్టినెంట్ వరలక్ష్మి, వెంకటరత్నం, అమృత, సునీత, నాగమణి, తులసి, సంధ్య, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి హాజరైన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో పలువురికి గాయాలు

**రాజాం సిటీ:** కుక్కలు విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. శుక్రవారం పట్టణ పరిధిలోని కాలెపువీధికి చెందిన చిన్నారి గంపల లలిత ఇంటి ముందు ఆరుబయట ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. వెంటనే స్థానికులు స్పందించి తీవ్రంగా గాయపడిన చిన్నారిని సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అలాగే మండల పరిధి మారేడుబాక గ్రామానికి చెందిన కోరాడ నారాయణమ్మ అనే వృద్ధురాలు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. కుటుంబసభ్యులు రాజాం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పట్టణంతోపాటు మండలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

**బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు**

**రాజాం సిటీ:** మండల పరిధి శ్రీకాకుళం రోడ్డులోని రెండో మైలు రాయివద్ద శుక్రవారం బైక్ అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం న్యూకాలనీకి చెందిన కేవీఎస్ భక్తవత్సలం తీవ్రగాయాల పాలయ్యాడు. రాజాం నుంచి స్వగ్రామం శ్రీకాకుళం ద్విచక్ర వాహనంపై ఆయన వెళ్తుండగా రెండో మైలు రాయి వద్దకు వచ్చేసరికి మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో భక్తవత్సలం తలకు తీవ్రగాయాలు కావడంతో 108కు సమాచారం అందించగా ఈఎంటీ ఆలుగుబిల్లి శ్రీనివాసరావు, పైలెట్ శంకరరావులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకుకుళం తరలించారు.

# తాగునీటికి కటకట..!

● జిల్లాకేంద్రంలో నాలుగురోజుల కోసారి సరఫరా
● గిరిజన ప్రాంతాల్లో తాగునీటికి అవస్థలు
● తూతూ మంత్రంగా క్రాస్ ప్రోగ్రాం
● ఎన్నికల ముందు హామీ ఇచ్చి మరిచిన నేతలు
● జిల్లాలో నాలుగు తాగునీటి ప్రాజెక్టులు



పార్వతీపురం పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)

**పార్వతీపురంటౌన్:** పార్వతీపురం మన్యం జిల్లాలో తీవ్రంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల గొంతెండుతోంది. అంతటా దాహం కేకలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలలుగా వర్షాలు కురవకపోవడంతో మన్యంలో చాలా చోట్ల భూగర్భ జలాలు, నదులు, చెరువులు అడుగంటాయి. అనేక చోట్ల బోర్లు మొరాయించాయి. రక్షిత నీటి పథకాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో జిల్లావాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. బిందెడు నీటి కోసం పరుగు పెడుతున్నారు. మరోవైపు వేసవిలో తాగునీటి సరఫరాపై అధికారుల ముందస్తు ప్రణాళిక కొరవడింది. జల్‌జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి వేసిన కుళాయిలు దిష్టిబొమ్మల్లా మారాయి. పైప్‌లైన్ల లీకులు తదితర సమస్యలతో కొన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు చేరడంలేదు. కొందరికి బురద నీరే సరఫరా అవుతోంది. విధిలేని పరిస్థితుల్లో ఆ నీటినే తాగి జిల్లా వాసులు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు చెలమల నీటిపై ఆధారపడుతున్నారు. ఇంకొన్ని చోట్ల రెండు, మూడు రోజులకోసారి మాత్రమే తాగునీరు అందిస్తున్నారు. గిరిజనప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డ, వాగు నీటినే గిరిజనులు వినియోగిస్తున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో రోజు తప్పించి రోజు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో తాగునీటి పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక వడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో రెండు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ, 451 పంచాయతీలున్నాయి. వాటి పరిధిలో 2,282 గ్రామాలున్నాయి. సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 11, పీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 808, ఎంపీడబ్ల్యూస్కీమ్‌లు 491, సోలార్ స్కీమ్‌లు 407, డైరెక్ట్ పంపింగ్ స్కీమ్‌లు 1,525 ఉన్నాయి. బోర్లు 7,518 వరకూ ఉన్నాయి. అయితే వాటి ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గతంలో జల్‌జీవన్‌మిషన్(జేజేఎం) పథకం కింద 2,013 పనులు మంజూరు చేశారు. ఇందులో 851 పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. వివిధ దశల్లో 703 పనులున్నాయి. అసలు ప్రారంభం కాని పనులు459 వరకూ ఉన్నాయి. ఈ స్కీమ్ ద్వారా గతంలో 1,21,246 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో 65,959 కుళాయి కనెక్షన్లు మాత్రమే పూర్తిచేశారు. 55,287 కుళాయి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**జిల్లా కేంద్రంలో నాలుగురోజులకోసారి..**

జిల్లాకేంద్రం పార్వతీపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో 220 పైగా బోరుబావులున్నాయి. వాటి నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. గతంలో జిల్లా కేంద్రంలో సుమారు రూ. 65కోట్లతో మెగా రక్షిత నీటి పథకం పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కూటమి నేతలు, అధికారులు ఈ పథకం ఊసే ఎత్తడం లేదు. మున్సిపాల్టీలో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ప్రధాన పైప్‌లైన్, దానికి అనుసంధానించిన లింకు పైప్‌లైన్‌ల లీకుల కారణంగా తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వేసవికాలంలో కుళాయిల ద్వారా నాలుగు రోజులకోసారి తాగునీటిని అందిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా రెండురోజులకోసారి నీటిని పంపిణీ చేస్తున్నారు.

**గిరిజన ప్రాంతాల్లో చెలమలు, నేలబావులే దిక్కు**

జిల్లాలో ఎక్కువశాతం గిరిజన ప్రాంతం ఉంది. గిరిజన ప్రాంతాల్లో, కొన్ని గిరిశిఖర గ్రామాల్లో తాగునీటి సమస్యకు గిరిపుత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మండలాల్లో చెలమల నీటినే గిరిజనులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని మండలాల్లో తాగునీరు సరిగా అందక సమీపంలో గల వసతి గృహాలకు వెళ్లి నీటిని బిందెలతో తీసుకురావల్సిన పరిస్థితి ఏర్పడింది. భామిని, సీతంపేట మండలాల్లో కిలోమీటర్ల దూరం మహిళలు, గర్భిణులు నీటికోసం తహతహలాడాల్సిన పరిస్థితి నెలకొందని గిరిజనులు వాపోతున్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేస్తాం**



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జల్ జీవన్ మిషన్ పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేస్తాం. 55,287 కుళాయి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వేసవి ఎద్దడిని నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా క్రాస్ ప్రోగ్రాం నిర్వహించాం. కొన్ని గిరిశిఖర గ్రామాలకు తాగునీటి ఇబ్బందులను గుర్తించాం. తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నాం. అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించాం.

–ఒ. ప్రభాకరరావు,
ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి,
పార్వతీపురం మన్యం

## రైతుల భూములు పోకుండా పైప్‌లైన్ వేయాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

**విజయనగరం ఫోర్ట్:** రైతుల భూములు పోకుండా ప్రత్యామ్నాయంగా విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే గ్రీన్‌హైవే పక్కగుండా హెచ్‌పీపీఎల్ వారు పైప్‌లైన్ వేసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ భూమి వినియోగపు హక్కు కోసం తీసుకునే ఉపరితల భూమిపై ఇళ్లు, తోటలు, బోర్లు, కట్టడాలు, పశువులు, కోళ్ల షెడ్లు వేసుకునే అవకాశం లేనందున మొత్తం భూమి విలువ కోల్పోతున్నందున రిజిస్ట్రార్ వేల్యూ పరిగణనలోకి తీసుకుని నాలుగు రెట్లు పెంచి ధరను నిర్ణయించి అందులో నుంచి 10 శాతం కాకున్నా 30 శాతం పరిహారం లెక్కకట్టి ఇవ్వాలని కోరారు. పండ్ల తోటలు, చెట్లు జీవితకాలాన్ని లెక్కించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణమూర్తి, గంట్యాడ మండల అధ్యక్షుడు కోడెల శ్రీను, రైతు సంఘం నాయకులు గణేష్, నారాయణరావు, గోపాలం, రాములు, పైడిపినాయుడు, ప్రసాద్, దాలినాయుడు, జగన్, సంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సహస్ర దీపాలంకరణ



స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

**నెల్లిమర్ల రూరల్:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

### చితికిపోయిన చిన్నారి

● లారీ ఢీకొని బాలుడి దుర్మరణం



బాలుడు లేఖన్‌కుమార్ (ఫైల్)

**కొత్తవలస:** తెల్లతెల వారగానే అప్పుడే నిద్ర లేచి అక్క పాల ప్యాకెట్‌కు వెళ్తోందని తాను కూడా వెంట వెళ్తానని ఏడేళ్ల బాలుడు మారాం చేసి అక్కతో పాటు వెళ్లాడు. పాల ప్యాకెట్ తీసుకుని అక్కాతమ్ముళ్లు రోడ్డు దాటుతుండగా యమపాశం రూపంలో దూసుకుచ్చిన భారీ లారీ బాలుడిపైకి వెళ్లడంతో శరీరం నుజ్జ నుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం తెలవారుజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాలుడి తల్లి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలంలోని అరకు–విశాఖ జాతీయ రహదారి కొత్తవలస ఫైర్‌స్టేషన్ సమీపంలోని జనార్దన్ లేవుట్‌లో గల సాయిసంపత్ అపార్ట్‌మెంట్‌లో వాణికుమారి ఇద్దరు పిల్లలతో కలిసి తన తల్లి వద్ద ఉంటోంది. ఇటీవల భర్తతో కలహాలు రావడంతో ఆమె పిల్లలతో వచ్చి తల్లి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఎప్పటిలాగానే కూతురు చందస్వి(9)నిని పాలప్యాకెట్ కోసం రోడ్డు అవతలి వైపు గల పాలబూత్‌కు పంపించగా తాను కూడా వెళ్తానని కుమారుడు లేఖనకుమార్ (7) అక్కతో పాటు వెళ్లాడు. పాలప్యాకెట్ కొని రోడ్డు దాటుతుండగా మితిమీరిన వేగంతో ఎస్‌కోట వైపు వెళ్తున్న భారీ లారీ ఢీకొట్టడంతో బాలుడు శరీరం ముక్కముక్కలై రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. పరిగెత్తుకుంటూ వెళ్లిన పాప జరిగిన విషయాన్ని తల్లి, అమ్మమ్మకు చెప్పడంతో వారు వచ్చి చూసేసరికి దారుణం జరిగిపోయింది. తల్లి వాణికుమారి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కంట తడి పెట్టించింది. విషయం తెలుసుకున్న కొత్తవలస సీఐ షణ్ముఖ రావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు పెంకుటిళ్లు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**గరుగుబిల్లి:** మండలంలోని చినగుడబలో మూడు పెంకుటిళ్లు శుక్రవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ముదిలి కళావతి, ముదిలి మోహన్ రావు, ముడిలి భాస్కరరావులకు చెందిన పెంకుటిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. కళావతి ఇంట్లో దీపం వెలిగించి ఉపాధిహామీ పనులకు వెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన విషయాన్ని తెలుసుకున్న పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో కళావతి కుటుంబం కట్టుబట్టలు మినహా గృహోపకరణాలు, నగదు, బీరువాలో ఉన్న బట్టలు విలువైన పత్రాలు, ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండడంతో ఘటనా స్థలానికి వెళ్లేందుకు ప్రజలు ముందుకు రాలేదు. అయితే అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా వెళ్లి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను తీసుకురాగా గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. మిగిలిన రెండు ఇళ్లలో పెద్దగా నష్టం జరగలేదు. ప్రమాద సమాచారం మేరకు ఘటనా స్థలానికి తహసీల్దార్ పి.బాల, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు వచ్చి పరిశీలించి ఆస్తినష్టాన్ని అంచనా వేశారు. నష్టనివేదికలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షలవరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖాధికారి జి. ప్రభాకరరావు తెలిపారు.

## ఆటో బోల్తాపడి ఉపాధి వేతనదారు మృతి



ప్రసాదరావు మృతదేహం

**వీరఘట్టం:** మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు అరసాడ ప్రసాదరావు(49) ఆటో బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు ఉపాధి హామీ ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం గడగమ్మ గ్రామం నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగోర గ్రామంలోని ఆరుద్రమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులకు గ్రామానికి చెందిన వేతనదారులు గడిచిన 7 వారాలుగా ఆటోలపై వెళ్తున్నారు. ఎప్పటిలాగానే శుక్రవారం కూడా వేతనదారులతోబయల్దేరిన ఆటోల్లో ఒక ఆటో అచ్చెపువలస గ్రామ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలైన అరసాడ ప్రసాదరావును మెరుగైన వైద్య చికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసాదరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.

**పిడుగుపాటుతో గిరిజన యువకుడు..**



చంద్రరావు మృతదేహం

**సీతంపేట:** మండలంలోని దేవనాపురం సమీపంలో పిడుగుపాటుకు గురై ఓ గిరిజన యువకుడు శుక్రవారం మృతిచెందాడు. జేపీ బూర్జగూడకు చెందిన సవర చంద్రరావు(28) దేవనాపురం ప్రాంతంలో ఉన్న పొలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నించిన అనంతరం ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు రావడంతో పిడుగు ఒక్క ఉదుటన దగ్గరగా పడడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు. మృతుడు అవివాహితుడు. తండ్రి జమ్మయ్య కొన్నేళ్ల కిందట మృతిచెందాడు. చంద్రరావు మృతివార్త విన్న తల్లి సొట్టమ్మ, సోదరుడు రమేష్‌లు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఎస్సై వై.అమ్మన్నరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## శాంతిని కోరుతూ చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

**విజయనగరం టౌన్:** భారత్ పాకిస్తాన్‌ల మధ్య తలెత్తిన వివాదం కారణంగా భారతీయ సైనికుల క్షేమం, దేశ శాంతిని కోరుతూ రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో శుక్రవారం వేద పండితులు శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధర్వణ వేదపండితుడు సాయికిరణ్ శర్మ, యుజుర్వేద పండితుడు వెలువలపల్లి నరసింహమూర్తి మాట్లాడుతూ విశ్వశాంతికి, భారతదేశం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, యుద్ధంలో మన సైనికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని యజ్ఞయాగాదులను నిర్వహించామన్నారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని చండీయాగం చేపట్టామని తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధికెక్కారని, సుమారు 80 మంది దంపతులు యాగంలో పాల్గొనడం విశేషమన్నారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

## ఉషు పోటీల్లో భామిని విద్యార్థుల సత్తా



విజేతలకు అభినందనలు తెలియజేస్తున్న కోచ్ సోమేష్, స్పోర్ట్స్ అధికారి దయానందం

**భామిని:** ఉషు పోటీల్లో భామిని విద్యార్థులు సత్తా చాటి మెడల్స్ సాధించి పలువురి మన్ననలు పొందారు. ఈ నెల 12,13 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో భామిని విద్యార్థులు విజేతలుగా నిలిచారని క్రీడల కోచ్ కె.సోమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటీడీఏ స్పోర్ట్స్ అధికారి ఎస్.జాకోబ్ దయానందం సహాయ సహకారాలతో పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఉషు పోటీలలో జూనియర్ విభాగంలో ఎస్.కె.శాంతి, సీనియర్ విభాగంలో పి.దీపిక, కె.సోమేష్‌లు గోల్డ్ మెడల్స్, పి.నాగరాజు, పి.చరణ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారని కోచ్ తెలిపారు. ఈ మేరకు పసుకుడిలో విజేతలను మండల నాయకులు బి.రవినాయుడు, కిరణ్‌కుమార్‌లు అభినందించారు.

## సారా రహిత గ్రామంగా అప్పయ్యపేట

● గ్రామసభలో పంచాయతీ తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకట్రావు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని కొత్తపేట పంచాయతీ అప్పయ్యపేట గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దామని ఎక్సైజ్ సీఐ వెంకట్రావు తెలిపారు. గ్రామపెద్దలు, ప్రజల సమక్షంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించి ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేశామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా సారా అమ్మకాలు జరిపే 'బి' కేటగిరిలో అప్పయ్యపేటను గతంలో గుర్తించామని, గడిచిన మూడు నెలల నుంచి గ్రామ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సారా అమ్మకాలు, నిల్వలపై నిఘా పెట్టామని, అనుమానితులను గుర్తించి బైండోవర్ చేశామన్నారు. అనంతరం జరిపిన దాడుల్లో మూడు నెలలుగా సారా విక్రయిస్తున్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, తాజాగా నిర్వహించిన గ్రామసభలో పూర్తిస్థాయి అంచనాకు వచ్చి సారా రహిత గ్రామంగా ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. ఇకపై ఎలాంటి అమ్మకాలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నాగేశ్వరరావు, సర్పంచ్ అట్టాడ శ్రీను, దత్తత అధికారి కృష్ణ, కార్యదర్శి బంగార్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## 16 కేజీల గంజాయితో నలుగురి అరెస్ట్



రైల్వేస్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

**కొత్తవలస:** మండల కేంద్రంలో గల రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టగా 16 కేజీల గంజాయితో నలుగురు నిందితులు పట్టుబడినట్లు సీఐ షన్ముఖ రావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ తెలిపిన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి కొత్తవలస రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించగా ప్లాట్‌ఫామ్–1లో బ్యాగులతో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి కంగారు పడి పారిపోయేందుకు సిద్ధమవుతుండగా పట్టుకుని విచారణ చేసినట్లు తెలిపారు. వారి దగ్గర ఉన్న బ్యాగ్‌లను తెరిచి చూడగా పది గంజాయి ప్యాకెట్లలో 16 కేజీలు గంజాయి ఉన్నట్లు చెప్పారు. విజయవాడ ప్రాంతంలోని వాంబే కాలనీకి చెందిన జోజిబాబు, శామ్యూల్‌జాన్, మనికంఠ, మహేశ్వరరావులుగా నిందితులను గుర్తించామన్నారు. ఒడిశాలోని పాడువలో ఒక వ్యక్తి దగ్గర 16 కేజీల గంజాయిని నిందితులు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందని, నిందితులు అక్కడి నుంచి కిరండోల్ రైల్లో కొత్తవలస వరకు వచ్చి అక్కడి నుంచి ఆటోలో విశాఖపట్నం చేరుకుని రోడ్డు మార్గంలో విజయవాడ వెళ్లేందుకు ప్రణాళిక వేసుకున్నారన్నారు. ఇందులో భాగంగా కొత్తవలస రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న సమయంలో పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి విజయనగరం జీఆర్‌పీ ఎస్సై బాలాజీకి గంజాయిని, నిందుతులను అప్పగించినట్లు సీఐ వివరించారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

**బాడంగి:** వినియోగదారులకు రేషన్‌డిపోల ద్వారా పంపిణీచేస్తున్న పీడీఎస్ బియ్యం ఆటోలో అక్రమరవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న సీఎస్‌డీటీ దారికాచి పట్టుకున్నారు. మండలంలోని ముగడ గ్రామానికి చెందిన వ్యాపారి పెద్దాడ వెంకటరమణ 6.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వినియోగదారులు, డీలర్లనుంచి కొనుగోలుచేసి సాలూరువైపు అక్రమంగా రవాణాచేస్తున్నట్లు తెలుసుకున్న సీఎస్‌డీటీ స్వర్ణలత బుధవారం సీహెచ్‌సీ–డొంకినవలస ఎత్తుకానా సమీపంలో దారికాచి పట్టుకున్నారు. బియ్యం ఖరీదు సుమారు రూ.29వేల 572ల వరకు ఉంటుందని అంచనా వేశారు. సంబంధిత వ్యాపారిపై 6ఏ కేసు నమోదు చేసినందున పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం హాజరుపరిచి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఎస్‌డీటీ చెప్పారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**పెందుర్తి:** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని, అతడ్ని రక్షించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి మండలం జంగాలపాలెం వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం(60)కు భార్య, కుమార్తె, అల్లుడితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి వీరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో చింతలపాలెనికి సమీపంలోని జంగాలపాలెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడానికి సిద్ధమయ్యాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో సమీపంలోనే ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ హుటాహుటిన అక్కడకు వెళ్లి, సత్యంను చాకచక్యంగా కిందికి దించేలా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. బంధువులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పర్యాటకంగా భోగాపురం అభివృద్ధికి చర్యలు



భోగాపురంలో విమానాశ్రయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

**భోగాపురం:** పర్యాటకంగా భోగాపురాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అన్నారు. మండలంలో ఆయన శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. రెడ్డి కంచేరు వద్ద ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బీచ్ రిసార్ట్స్‌ను, కవులవాడలో కన్వెన్షన్ నిర్మాణ పనులను పరిశీలించారు. సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కలెక్టర్ అంబేడ్కర్‌తో కలిసి పరిశీలించారు. నిర్ణీత గడువుకంటే ముందుగానే ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయని జీఎంఆర్ గ్రూప్ సీఈఓ మన్మోయ్‌రాయ్ వివరించారు. అనంతరం అజయ్‌జైన్ మాట్లాడుతూ అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతున్న తరుణంలో పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి హోటళ్ల నిర్మాణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, విమానాశ్రయ సిబ్బంది పాల్గొన్నారు.